క్లుప్తంగా

గడ్డివాము దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

బెజ్జూర్: మండలంలోని నాగులవాయి గ్రామానికి చెందిన వశక విజయ్ అనే రైతు పశువుల మేత కోసం గడ్డివాము ఏర్పాటు చేశాడు. శుక్రవారం ప్రమాదశాత్తు నిప్పు అంటుకుంది. గమనించిన స్థానికులు బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్‌కు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎస్సై వెంట కానిస్టేబుల్ వెంకటేశ్, సిబ్బంది ఉన్నారు.

పూలాజీబాబా ధ్యాన్ మందిర్ వార్షికోత్సవం



నివాళులర్పిస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని శ్రీశ్రీ సంత్ సద్గురు పూలాజీబాబా ధ్యాన్ మందిర్ 19వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలాజీబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పూలాజీబాబా సూచించిన భక్తిభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ అండ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాకురే రాందాస్, ప్రధాన కార్యదర్శి కరాడే మారుతి, డాకురే మాధవ్, బక్కన్న, పవాన్, మాధవ్, గజానంద్, తిరుపతి, వామన్, శివాజీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్ష



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోథ్: ఎస్సీ వర్గీకరణ చట్టాలను అసెంబ్లీలో ఆమోదించకుండా గ్రూప్స్ ఫలితాలను వెల్లడించడం సరికాదని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణను చట్టసభల్లో ఆమోదించాలని వారు డిమాండ్ చేస్తూ చేస్తున్న దీక్షలు మండల కేంద్రంలో మూడో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్, శంకర్, స్వామి కిరణ్ అశోక్ రాజు పోతరాజు శ్రీకాంత్ దేవన్న, హనుమాన్లు పాల్గొన్నారు.

నార్నూర్: వర్గీకరణ చట్టం తర్వాతనే గ్రూప్ 1,2,3 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేపట్టాలని, మాంగ్ కులస్తులను గ్రూప్(బి)లో చేర్చాలని మూడు రోజులుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేస్తున్నారు. శుక్రవారం నోటికి నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి నవీన్ మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీల నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని లోపాలను సవరించే వరకు ఉద్యోగ భర్తీ ప్రక్రియ వర్గీకరణ చట్టం ద్వారానే జరగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుదర్శన్ కాంబ్లే, విజయ్ కిరణ్ చిప్పకుర్తి, హనుమంతు కాంబ్లే, జిల్లెపల్లి గణేష్, తిరుమలేష్, సునీల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

భక్తి మార్గంలో నడవాలి

తానూరు: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన భారత్ మహారాజ్ సూచించారు. మండలంలోని మొగ్గి గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన కీర్తన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భక్తిమార్గంపై పలు సూచనలు చేశారు. ఆధ్యాత్మిక సాధనతోనే ప్రశాంతత సాధ్యమని.. చెడువ్యసనాలకు దూరం ఉంటూ ఆధ్యాత్మిక బాటలో పయనించాలని పేర్కొన్నారు. భక్తులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు గాలికి

మందమర్రిరూరల్: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో పనులు పూర్తయ్యి నెల రోజులు కూడా గడవకముందే పగుళ్లు తేలుతున్నాయి. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.కోటి పైచిలుకు నిధులతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మండలంలోని వెంకటాపూర్ ఎమ్మెల్యే కాలనీలో నిర్మించిన కాలువ పగుళ్లు తేలినా మండలస్థాయి అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అభివృద్ధి పనుల విషయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక అధికారులతో తనిఖీలు చేయించాలని కోరుతున్నారు.



రెబ్బెన: చిన్నారుల సందడి



లింగాపూర్: యువత సందడి



కెరమెరి: నృత్యం చేస్తున్న యవకులు



బెజ్జూర్: హోలీ వేడుకల్లో ఎస్సై ప్రవీణ్ కుమార్

హోలీ.. ఆనందాల కేళీ

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని సందడి చేశారు. సింగరేణి ఉద్యోగులు, అధికారులు, ఆయా సంఘాల నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దప్పు చప్పుళ్లకు, డీజే పాటలకు స్టెప్పులేశారు. ఎమ్మెల్సీ దండె విఠల్ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు మున్సిపల్ కార్మికులకు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి, నెట్‌వర్క్



కాగజ్‌నగర్ రూరల్: ఎమ్మెల్సీ విఠల్‌కు హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



కౌటాలలో..



రెబ్బెన: హోలీ జరుపుకుంటున్న యువకులు



పెంచికల్‌పేట్: రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



ఆసిఫాబాద్‌రూరల్: చిన్నారుల కేరింత

హరితహారం మొక్కలకు ముప్పు



కాలిపోయిన హరితహారం మొక్కలు

వాంకిడి: హరితహారంలో భాగంగా రహదారుల గుండా నాటిన మొక్కలకు నిప్పు ముప్పు ఉంది. నాటిన మొక్కలలో ఎక్కువ శాతం పశువులకు ఆహారంగా, నీళ్లు లేక చనిపోతూ ఉంటే అందులో కొన్ని మాత్రమే చిగురు తొడుగుతున్నాయి. కనీసం వాటిని అయినా రక్షించడంలో అధికారులు పట్టించుకోవడం లేదు. చిన్న వాంకిడి నుంచి జంబుల్‌ధరి గ్రామం వరకు నాటిన హరితహారం మొక్కలలో చాలా మొక్కలు బతికే ఉన్నాయి. అయితే రహదారి గుండా పిచ్చి మొక్కలు, పొదలు కమ్ముకొవడంతో మొక్కలు ఎదగడం లేదు. రహదారి గుండా పంట పొలాలు ఉన్న రైతులు ఆ పొదలను తొలగించకుండా నేరుగా నిప్పు పెడుతున్నారు. దీంతో పొదల్లో ఉన్న హరితహారం మొక్కలు సైతం కాలిపోతున్నాయి. పంచాయతీ అధికారులు పొదలను తొలగించి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా 'దురాడి' సంబురం



బూడిద వద్ద పూజలు చేస్తున్న ఆదివాసీలు

- సంప్రదాయబద్ధంగా ఆదివాసీల పూజలు



సాకడ ఇంటి ఎదుట బూడిద చల్లుతూ..

కెరమెరి(ఆసిఫాబాద్): హోలీ పండుగ సందర్భంగా తొలిరోజు పులారా కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదివాసీలు.. రెండో రోజు శుక్రవారం దురాడి(రంగోత్సవం) సంబురంగా జరుపుకొన్నారు. గురువారం రాత్రి కామదహనం నిర్వహించి అక్కడే రాత్రంతా జాగరణ చేశారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. 'మాతారి.. మాతరల్'లను కామదహనం చేసిన బూడిదను ఇతరులు దొంగలించకుండా ఉండేందుకు జాగారణ చేస్తూ కాపలా కాశారు. శుక్రవారం ఉదయమే ఇంట్లో చేసిన గూడాలతోపాటు గొడ్డలి, గడ్డపారలతో పులిమేరకు వద్దకు వెళ్లారు. అక్కడ నైవేద్యం సమర్పించారు. పొదలు కొట్టడం ద్వారా పొలం పనులు ప్రారంభించినట్లు ఆదివాసీ నాయకులు తెలిపారు. బూడిదను తీసుకెళ్లి ఇళ్ల ఎదుట చల్లారు. దురాడిలో భాగంగా డోలు వాయిస్తూ 'జాజిరి.. జాజిరి..' అంటూ ఇంటింటికీ తిరుగుతూ బోజర(ధర్మం) అడిగారు. మధ్యాహ్నం తర్వాత సమీపంలోని వాగుల్లో స్నానాలు ఆచరించి ఇళ్లకు వెళ్లిపోయారు.

వైభవంగా లక్ష్మీ నరసింహా స్వామి జాతర



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆలయంలో కొలువై లక్ష్మీ నర్సింహాస్వామి

రెబ్బెన: మండలంలోని రాళ్లపేటలో గల పురాతన లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం హోలీ రోజు ఆలయంలో స్వామి వారి జాతర మహోత్సవాన్ని నిర్వహించటం అనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయంలో స్వామి వారి జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఉత్సవ విగ్రహానికి పట్టువస్త్రాలు సమర్పించారు. మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు ఉపేందర్, వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వంకులం, కొండపల్లి, రాంపూర్, రాళ్లపేట గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్ జాదవ్ ప్రేందాస్, పెద్దలు మురళీధర్, బోర్కుటే తిరుపతి, జూపాక అనిల్, దస్రు, రాథోడ్ బాపు రావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నార్నూర్: ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని అన్యాయంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తుండంగా సీఐ రహీం పాషా ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఫాక్స్ చైర్మన్ ఆడే సురేశ్ మాట్లాడుతూ.. తెలంగాణలో నియంత పాలన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సాక్షిగా ప్రశ్నిస్తే అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల్లో అబద్దపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై సస్పెండ్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఊర్వేత రూప్‌దేవ్, సయ్యద్ ఖాసిం, రమేశ్‌రాథోడ్, ఫిరోజ్ ఖాన్, శివాజీ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వైకుంఠధామాలు

- ప్రారంభానికి నోచుకోని వైనం
- ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం



నిరుపయోగంగా ఈదులవాడ వైకుంఠధామం

ఆసిఫాబాద్‌రూరల్: గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. నిర్మాణం పూర్తి చేసి ఏళ్ల గడిచి సర్పంచ్‌ల పదవి కాలం ముగిసినా.. ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా 335 గ్రామ పంచాయతీల్లో వైకుంఠధామాలు దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట వాగు పక్కనే నిర్మించడంతో వరద ఉధృతికి కొట్టుకుపోయాయి, నాసిరకంతో నిర్మించడంతో గోడలకు బీటలు వారుతున్నాయి. చుట్టూ చెట్లు పెరిగి కులిపోయే స్థితికి చేరుకున్నాయి. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పట్టించుకునేలా కనిపించడం లేదు. జిల్లాలో ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీలకు కోట్ల రూపాయలతో నిర్మించిన వైకుంఠధామాలు, డంప్‌యార్డ్, సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగానే దర్శనం ఇస్తున్నాయి. సెగ్రిగేషన్ షెడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

జిల్లా 315 గ్రామ పంచాయతీలు...

జిల్లా వ్యాప్తంగా 315 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీకి వైకుంఠధామమాల నిర్మాణాలకు 2019లో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటిలో ఆసిఫాబాద్ మండలంలో 27 జీపీల్లో పీఆర్ శాఖ 22 గ్రామ పంచాయతీల్లో, ఈజీఎస్ ద్వారా 4, రూర్బన్ నిధుల నుంచి జిల్లా కేంద్రం ఒకటి నిర్మాణం చేపట్టారు. పీఆర్ శాఖ నుంచి నిర్మించిన వాటికి రూ. 12.60 లక్షలు, ఈజీఎస్ ద్వారా నిర్మించి వాటికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. జిల్లాలో సుమారు రూ.8.29 కోట్లతో 335 పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మాంచి నిరుపయోగంగా వదిలేశారు. వాటికి నీటి కరెంట్ సౌకర్యాం లేక నిరుపయోగంగానే ఉంటున్నాయని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

నిర్మించి వదిలేశారు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించి నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించి ప్రారంభించలేక పోయారు. కోట్ల రూపాయాలతో నిర్మించి ప్రధానంగా కరెంట్, నీటి సౌకర్యం కల్పిస్తే ఉపయోగంలోకి వస్తాయి. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారటీలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో నిరుపయోగంగానే మారనున్నాయి. కొన్ని చోట్ల నాసిరకం పనులు చేపట్టడంతో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. మరికొన్ని గాలికి పై రేకులు లేచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామాలను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా కుస్తీ పోటీలు



కుస్తీ పోటీలో పాల్గొన్న మల్లయోధులు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో శుక్రవారం మహారాష్ట్ర, తెలంగాణ మల్లయోధులతో కుస్తీ పోటీలను ఘనంగా నిర్వహించారు. కుస్తీ పోటీల ఫైనల్‌లో మహారాష్ట్రలోని హిమయత్‌నగర్‌కు చెందిన బోర్‌గడి సతీష్ యాదవ్, నాసిక్‌కు చెందిన సాయినాథ్ కారాడే విజయం సాధించి రూ. 20 వేల నగదు గెలుచుకున్నారు. కుస్తీ పోటీలలో 40 మంది వరకు మల్లయోధులు పాల్గొన్నారు. ప్రేక్షకుల మధ్య కుస్తీ పోటీలు రసవత్తరంగా జరిగాయి. అన్ని విభాగాల కుస్తీ పోటీలకు రూ.1 లక్ష వరకు ఖర్చు చేశారు. కార్యక్రమంలో ఎస్సై అప్పారావ్, మాజీ సర్పంచ్ పరచ సాయన్న, ఉప సర్పంచ్ చట్ల విలాస్, చట్ల నందకుమార్, చట్ల గజ్జాయ్య, డీసీ రమణ, విజేందర్, చట్ల ఉత్తం, బత్తిని కిషన్, వెంకట రమణ, సూర్యవంశీ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని రైల్వేఓవర్ బ్రిడ్జి సమీపంలోని కిరాణా షాపుపై శుక్రవారం పోలీసులు దాడి చేసి మద్యం పట్టుకున్నారు. పట్టణ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాత మధు ఆస్పత్రి సమీపంలోని కిరాణాషాపులో సోదాలు చేయగా.. రూ. 7,700 రూపాయల విలువ గల మద్యం లభించిందన్నారు. ఈ మేరకు షాపు నిర్వాహకుడు ఈదుల లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు.

మూగజీవుల అరణ్య వేదన



ఖర్జెల్లి రేంజ్ అడవిలో మంటలు

- అడవిలో కార్చిచ్చు
- రోడ్డుపైకి వస్తున్న జంతువులు



రహదారిపైకి వచ్చిన కోతులు

చింతలమానెపల్లి: అడవులు వన్యప్రాణులకు ఆవాసాలు. మండలంలోని ఖర్జెల్లి రేంజ్ అడవిలో అనేక వన్యప్రాణులు ఉంటాయి. వాతావారణ మార్పులతో అడవుల్లో చెట్లు ఆకురాలి ఎండిపోయి కనిపిస్తున్నాయి. పెరిగిన ఉష్ణోగ్రతలతో, అడవిలో మంటలతో అడవుల్లో మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఖర్జెల్లి రేంజ్‌లోని అటవీ ప్రాంతంలో గత కొద్ది రోజులుగా రాలిన ఆకులకు నిప్పంటుకుని మండుతున్నాయి. ఓవైపు అటవీ ప్రాంతంలో నీటి వనరులు తగ్గిపోగా ఇబ్బంది పడుతున్న మూగజీవాలు మంటల వేడిని తట్టుకోలేక పోతున్నాయి. అటవీ ప్రాంతంలోని కోతులు ఈవేడిని తట్టుకోలేక మానెపల్లి నుంచి గూడెం వెళ్లే రహదారిపైకి వస్తున్నాయి.

రోజూ పేపర్ చదవాలి..

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ జ్యోతి బాపూలే (ఎంజేపీ)బా లుర గురుకులంలో భౌతి క శాస్త్రం బోధించే అజీజ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్(జేఎల్)గా ఎంపికయ్యాడు. ఈనెల 12న హైదరాబాద్ రవీంద్రభారతిలో నియామక పత్రం అందుకున్నారు. జిల్లాకేంద్రంలోని గాజుల్‌పేట్‌కు చెందిన అజీజ్ రాచా పూర్ గురుకులంలో పని చేస్తూనే పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యాడు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఫలితాల్లో 32వ ర్యాంకు సాధించాడు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువకులకు అజీజ్ పలు సూచనలు చేశారు. నోట్స్ తయారు చేసుకోవాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న చెట్ల నరికివేత



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెం సమీపంలో ఏర్పాటు చేసిన హరితవనంలో చెట్ల నరికివేత కొనసాగుతుంది. శుక్రవారం గ్రామస్తులు మరో 150 చెట్లను నరికివేశారు. దీంతో అటవీశాఖ అధికారులు.. గ్రామస్తులతో చర్చల్లో పురోగతి కన్పించడం లేదు. పోచ మ్మ ఆలయ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తేనే చెట్ల నరికివేత నిలిపివేస్తామని గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ ఓ గీతారాణి, అటవీశాఖ అధికారులు ప్రభాకర్, శ్రీనివాస్, నిమాన్ తదితరులు ఉన్నారు.